క్లుప్తంగా

పాటిపల్లి, వాడ్రాపల్లిల్లో కేంద్ర బృంద సభ్యుని పరిశీలన



వాడ్రాపల్లిలో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని పాటిపల్లి, వాడ్రాపల్లి పంచాయతీల్లో కేంద్ర పథకాల అమలు తీరును కేంద్ర బృంద సభ్యుడు అనిల్ గైక్వాడ్ శనివారం పరిశీలించారు. గ్రామాల్లో అభివృద్ధితో పాటు కేంద్ర పథకాలు క్షేత్ర స్థాయిలో ఎంతమేర ప్రజలకు చేరువవుతున్నాయి, వ్యక్తిగత లబ్ధి, తదితర వివరాలను లబ్ధిదారుల నుంచి సేకరించారు. పథకాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ, అర్హులకు అందుతున్నాయా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ ద్వారా జరిగిన ప్రగతిని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రసాద్, డీపీఎం శ్రీనివాస్, ఏపీవో శివ, వెలుగు ఏపీఎం కొండమ్మ, సర్పంచ్‌లు కాండ్రేగుల నూకరాజు, ఆడారి కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి ఉన్నారు.

చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నరికివేసిన నీలగిరి దుంగలు

అచ్యుతాపురం(మునగపాక):పంచాయతీ అనుమతులు లేకుండా చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దిబ్బపాలెం పంచాయతీ కార్యదర్శికి శనివారం పలువురు ఫిర్యాదు చేశారు. నరికివేసిన నీలగిరి దుంగలను గుట్టు చప్పుడు కాకుండా తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మునగపాకలో తుప్పల తొలగింపు పనులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో మంజులావాణి

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఎల్‌డీవో మంజులావాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే దారిలో పేరుకుపోయిన తుప్పలను స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి,పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలికి సన్మానం



పద్మావతిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయురాలు లోకారెడ్డి పద్మావతిని పీఆర్‌టీయూ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. పి.ధర్మవరంలో నివాసముంటున్న ఆమెను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. పీఆర్‌టీయూ మండల కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గారా ప్రకాష్ ,నాగేశ్వరరావు, కొండబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పెయ్యిలపై కుక్కల దాడి

కె.కోటపాడు: ఆర్.వై.అగ్రహారం గ్రామంలో రైతు బోను సత్యనారాయణమూర్తికి చెందిన రెండు పెయ్యిలపై శనివారం కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో రెండు పెయ్యిలు తీవ్ర గాయాలయ్యాయి. పాక వద్ద ఎవరూ లేని సమయంలో గుంపులుగా వచ్చిన కుక్కలు రెండు పెయ్యిలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో అవి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్టు ఆ రైతు తెలిపారు.

ఎండవానల్లో నిలువుకాళ్ల నిరీక్షణ

బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులకు అవస్థలు



రాంబిల్లిలో శిథిలావస్థలో ఉన్న బస్‌షెల్టర్



వెంకటాపురం జంక్షన్‌లో బస్‌స్టాప్ లేక ఎండలో నిల్చున్న ప్రయాణికులు,విద్యార్థులు

రాంబిల్లి (యలమంచిలి): మండలంలోని పలు గ్రామాల్లో బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాంబిల్లికి పలు ప్రాంతాల నుంచి నిత్యం గ్రామీణులు, విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సుల కోసం వేచి ఉండేందుకు నిలువ నీడ లేక వారు నానా అవస్థలకు గురవుతున్నారు. ఎండకు ఎండి, వానకు తడుస్తూ వేచి ఉండవలసి వస్తోంది. రాంబిల్లిలో బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరింది. అది కూలిపోయే స్థితిలో ఉండడంతో దానిలోకి వెళ్లేందుకు ప్రయాణికులు భయపడుతున్నారు. రాంబిల్లికి గాజువాక, విశాఖపట్నం, యలమంచిలి తదితర ప్రాంతాల నుంచి ఉద్యోగులు అధికంగా వస్తుంటారు. వీరంతా వెంకటాపురం వై.జంక్షన్ వద్ద దిగుతారు. రాంబిల్లి నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ జంక్షన్‌లోనే బస్సు ఎక్కాలి. ఇక్కడి నుంచే వందలాది మంది విద్యార్థులు యలమంచిలి, అచ్యుతాపురం,అనకాపల్లి,విశాఖపట్నంలలో స్కూళ్లు,కాలేజీలకు వెళుతుంటారు. అయితే ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో సమీపంలో ఉన్న ఆలయాల వద్ద, టీ దుకాణాల వద్ద వేచి ఉండవలసి వస్తోంది. ఎండలో వేచి ఉండలేక పలువురు ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆర్టీసీకి రావలసిన ఆదాయానికి గండిపడుతోంది.

మండలంలో వెంకటాపురం జంక్షన్, జంగాలాపాలెం, వాడనర్సాపురం,కొత్తపట్నం,పంచదార్ల భోగాపురం,మామిడివాడ గ్రామాల్లో బస్ షెల్టర్లు లేవు. మరికొన్ని ప్రాంతాల్లో రోడ్డుకు దూరంగా బస్ షెల్టర్లు ఉండడంతో ప్రజలు అక్కడకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. బస్ షెల్టర్లు లేకపోవడంతో ఆయా స్టాప్‌లలో ఆర్టీసీ బస్సులను ఆపడం లేదు. మండల కేంద్రంలో ఉన్న బస్‌షెల్టర్‌కు మరమ్మతులు చేయించి, మిగతా ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్‌షెల్టర్లు లేక ఇబ్బందులు



రాంబిల్లి మండలంలోని పలు గ్రామాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.ఎండలో ఎండి, వానలో తడుస్తూ బస్సుల కోసం వేచి ఉండవలసి వస్తోంది. బస్ షెల్టర్లు నిర్మించి, ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి.

– బద్ది ఆనంద్, వైలోవ

ఆర్టీసీ బస్సులు ఆపడం లేదు



పలు గ్రామాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో స్టాపుల్లో ఆర్టీసీ బస్సులను ఆపడం లేదు. దీంతో ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించవలసి వస్తోంది. వ్యయ ప్రయాసలకు గురవుతున్నాం. ఆటో డ్రైవర్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. భోగాపురం గ్రామం వద్ద బస్‌షెల్టరు నిర్మించాలి,

– మిడతాన శ్రీను, భోగాపురం

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు ?

పాయకరావుపేట మండల సమావేశంలో అధికారులను ప్రశ్నించిన సర్పంచ్‌లు



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాష్ రావు

పాయకరావుపేట: సమస్యలను పరిష్కరించనప్పుడు మండల సమావేశాలు నిర్వహించడమెందుకని పలువురు సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నించారు. ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు ప్రతిసారీ మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారని, మండలంలోని సమస్యలు పరిష్కారం జరగడం లేదన్నారు. గత సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలను అధికారులు పరిష్కరించలేదని తెలిపారు. మండలంలో జల్‌జీవన్ మిషన్ పనులు సక్రమంగా జరగలేదని తెలిపారు. భూములు రీసర్వేలో కొన్ని లోపాలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని, తీర ప్రాంతంలో ఉన్న తుపాను షెల్టర్లు శిథిలావస్థకు చేరాయని, వాటిని వెంటనే తొలగించాలని కోరారు. లేకపోతే అవి కూలిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మండలంలో డీ ఫారం పట్టాలు పొందిన వారు కాకుండా వేరొక వ్యక్తులు భూములు అనుభవిస్తున్నారని, వీటి పై విచారణ చేయాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. ఉపాధి హామీ పనుల కోసం రూ.11 కోట్లతో చేపట్టిన ప్రతిపాదనల పై గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎన్ఆర్ఈజీఎస్ డీపీవో హేమలత చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, ఎంపీపీవో జయప్రకాష్ రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోటవురట్ల: విశాఖలో ఈ నెల 11న జరగనున్న ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ ఉత్తరాంధ్ర కోస్తా జిల్లాల కన్వీనర్ ఎం.చినసుబ్బారావు కోరారు. రాట్నాలపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటానికి సుప్రీం కోర్టు ద్వారా విజయం లభించిందన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నేతృత్వంలో భారీ బహిరంగ సభతో పాటు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సభకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని, ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వై.మల్లిబాబు, ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీటీసీ వి.రాంబాబు, మాజీ సర్పంచ్ జి.అప్పారావు, సభ్యులు శ్రీనివాసరావు, పరశురాం, కొండలరావు పాల్గొన్నారు.

చినుకు పడితే.. చెరువే



చెరువులా దర్శనమిస్తున్న పాఠశాల ప్రాంగణం



పాఠశాల భవనం ముందు నిలిచిన వర్షం నీరు

ఎస్.రాయవరం: చిన్నపాటి వర్షం కురిసినా ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాలలో నీరు నిలిచిపోయి చెరువులా మారుతుండడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. కాంట్రాక్టర్ సక్రమంగా నాడు–నేడు పనులు చేయకపోవడం వల్ల వర్షం నీరు బయటకు పోయే మార్గం లేక ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ పాఠశాలలో మరికొన్ని పనులు పూర్తి కావాల్సి ఉంది.

ఆ పనులు చేసే సమయంలోనైనా వర్షం నీరు బయటకు పోయే విధంగా మార్గం ఏర్పాటు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

8,9 తేదీల్లో కేంద్ర బృందం పర్యటన



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: మండలంలో ఈ నెల 8,9 తేదీల్లో కేంద్ర బృందం పర్యటిస్తుందని, అధికారులు వారికి అందుబాటులో ఉండాలని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 8వతేదీ మధ్యాహ్నం 2గంటలకు న్యాయంపూడి, 9వతేదీ ఉదయం 8గంటలకు రమణయ్యపేట, మధ్యాహ్నం డీఎల్‌పురం గ్రామాల్లో బృందం పర్యటిస్తుందని చెప్పారు. కేంద్రప్రభుత్వం నిధులతో అమలు జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, ఐకేపీ, వ్యవసాయ, మహిళా శిశుసంక్షేమశాఖ , సూక్ష్మనీటిపారుదల, గృహనిర్మాణశాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులను వారు పరిశీలిస్తారన్నారు. క్షేత్రస్థాయిలో ఈ పథకాల అమలు తీరుతెన్నులను పరిశీలించడంతోపాటు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

మునగపాకలో భారీ వర్షం



మునగపాక మెయిన్ రోడ్డులో కురుస్తున్న వర్షం

మునగపాక: మండల వ్యాప్తంగా శనివారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అరగంట పాటు విపరీతంగా గాలులు వీచాయి. శుభ కార్యక్రమాలతో పాటు దుర్గాదేవి మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనల నిర్వాహకులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలకు గురయ్యారు. స్థానిక మెయిన్‌రోడ్డు, మండల సముదాయానికి వెళ్లే దారిలో వర్షపునీరు నిలిచిపోయింది. ఈవర్షం వరి పంటకు మేలు చేస్తుందని వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారి తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి పెదపల్లి రిజర్వాయర్‌కు సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై యలమంచిలి రూరల్ పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు.ఇక్కడ కోతాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ ఉపేంద్ర,సిబ్బంది దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేయగా, ఓ వ్యక్తి పరారయ్యాడు. వారి వద్ద నుంచి రూ.18,200 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

భవానీ భక్తులకు భిక్ష



కల్యాణమండపంలో భిక్ష స్వీకరిస్తున్న భవానీ భక్తులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి టీఎస్ఆర్,హెటిరో కల్యాణ మండపంలో భవానీ దీక్ష చేపట్టిన భక్తులకు అన్నసమారాధన(భిక్ష) కార్యక్రమం వరుసగా నాలుగోరోజు కొనసాగింది. శనివారం నక్కపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన భవానీ భక్తులు భిక్షను స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వీసం రామకృష్ణ, వీసంనానాజీ తదితరుల ఆధ్వర్యంలో పలువురు దాతల విరాళాలతో భవానీ భక్తులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. పదిరోజులపాటు ఈ భిక్ష సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.భవానీభక్తుల కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పలువురు దాతలు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు.

బాలల స్నేహపూర్వక పంచాయతీగా డీఎల్ పురం!

- కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపిక చేసేందుకు రేపు కేంద్ర బృందం పర్యటన
- సంతృప్తి చెందితే పంచాయతీకి రూ.50 లక్షల ప్రోత్సాహకం



డీఎల్ పురం పంచాయతీలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీపీవో శిరీషారాణి



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన డీపీవో శిరీషారాణి



డీఎల్ పురం పాఠశాలలో 'నాడు నేడు' పథకం కింద చేపట్టిన పనులు

నక్కపల్లి: కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రతి ఏటా ఇచ్చే చైల్డ్ ఫ్రెండ్లీ అవార్డు (బాలల స్నేహపూర్వక)కు మండలంలోని డీఎల్ పురం పంచాయతీని పరిశీలిస్తున్నారు. పంచాయతీ కార్యకలాపాలు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను పరిగణనలోకి తీసుకొని ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. అవార్డుతోపాటు నగదు పురస్కారం రూ.50 లక్షలు అందిస్తారు. కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నత స్థాయి అధికారుల బృందం ఈనెల 7వ తేదీ సోమవారం డీఎల్ పురం గ్రామాన్ని సందర్శించనుందని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి తెలిపారు. శనివారం ఆమె స్థానిక ఎంపీడీవో సీతారామరాజుతో కలసి గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తీరు, అక్కడ మౌలిక సదుపాయాలు, కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పోషకాహారం అందుతుందా లేదా అనే విషయాలను పరిగణనలోకి తీసుకుంటారని సమాచారం. ఈ గ్రామంలో ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇక్కడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నాడు నేడు పథకం కింద మౌలిక సదుపాయాలు కల్పించారు. కేంద్ర బృందం సంతృప్తి చెందితే అవార్డుకు సిఫార్సు చేస్తారు.

వన్యప్రాణుల సంరక్షణలో భాగస్వాములవ్వాలి



డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ పరిధి అధికారి అనిల్‌కుమార్

యలమంచిలి రూరల్: వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని యలమంచిలి అటవీ పరిధి అధికారి బి.అనిల్‌కుమార్ అన్నారు.ఏటా అక్టోబరు 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే వన్యప్రాణి సంక్షరణ వారోత్సవాల ప్రాముఖ్యతను ఆయన శనివారం స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వివరించారు. మనుషులతో పాటు వన్యప్రాణులు కూడా జీవించినప్పుడే జీవవైవిధ్యం సాధ్యమతుందని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం 1972లో చేసిన చట్టాన్ని గురించి విద్యార్థులకు వివరించారు.వన్యప్రాణులను వేటాడినా,వాహనంతో ఢీకొట్టి చంపినా కఠిన చర్యలుంటాయని తెలిపారు.విద్యార్థి దశ నుంచే వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు వన్యప్రాణులకు సంబంధించి క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్,జంతుశాస్త్ర విభాగం హెచ్‌వోడీ ఎ.అర్జున అప్పారావు,జంతుశాస్త్ర అధ్యాపకురాలు కె. సుజాత,ఫారెస్ట్ సెక్షన్ అధికారి బి.వి. రమణ, బీట్ సిబ్బంది వేణుకుమారి, లావణ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరచుకోవాలి



మునగపాకలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రసాద్



మునగపాక నందీశ్వర ప్రాంగణంలోని దుర్గాదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పల్లపు వీధిలోని దుర్గాదేవి, గోనాలమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని శనివారం ప్రసాద్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవదర్శనం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,పార్టీ నేతలు కోనపల్లి రామ్మోహనరావు,ఆడారి కాశీబాబు,ఉత్సవకమిటీ చైర్మన్ వేగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. మునగపాక నందీశ్వర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకున్నారు.

రోడ్డెక్కిన భవన నిర్మాణ కార్మికులు

ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని డిమాండ్



ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు,మేస్త్రీలు

యలమంచిలి రూరల్: ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని, అందరికీ ఇసుక లభించేలా చూడాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయకుండా గత ప్రభుత్వంలో కంటే మరింత ధర పెంచిందని విమర్శిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని, ఇసుకను అందరికీ అందుబాటులోకి తేవాలని సీపీఎం జిల్లా నాయకులు కె. అప్పారావు,రొంగలి రాము,చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. ఇసుక లభించకపోవడంతో గ్రామాలు,పట్టణాల్లో ఇళ్లు నిర్మించుకునే వారు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అధిక ధరలను వెచ్చించి ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి టన్ను ఇసుక రూ.1,070 ఉండేదని, ఇప్పుడు టన్ను ఇసుక రూ.2,000 నుంచి రూ.2,300లకు పెరిగిందన్నారు.జిల్లాలో భవన నిర్మాణ రంగంపై సుమారు 50వేల మంది ఆధారపడి జీవిస్తున్నారని,వారందరి పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.మండలంలో పలు గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించి ఉపాధి పొందేవారికి పని లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికారంలోకి వచ్చాక కూటమి పార్టీల నాయకులు అప్పటివరకు రాష్ట్రంలో ఉన్న ఇసుక నిల్వనన్నింటినీ దోచుకుని మాయం చేశారని ఆరోపించారు.ప్లకార్డులు ప్రదర్శించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల డీటీ బాలేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రీలు లక్ష్మణ్, రామకృష్ణ, గణేష్, పట్టణానికి చెందిన పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.